క్లుప్తంగా

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం



మచిలీపట్నం టౌన్: చిలకలపూడి పాండురంగ స్వామి వారి ఆలయంలోని రుక్మిణి, రాధ, సత్యభామ అమ్మ వార్లు శనివారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు మేళతాళాల మధ్య ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సారె సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ నిర్వాహకుడు టీకే నరసింహం పర్యవేక్షించారు.

మంజుల శ్రీవేణికి డాక్టరేట్



చిలకలపూడి(మచిలీపట్నం): నోబుల్ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి మంజుల శ్రీవేణి డాక్టరేట్‌ను అందుకున్నారని నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే ఎర్నెస్ట్ శనివారం తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజీ విభాగంలో హమిల్టిన్ 1822 అంశంపై ప్రొఫెసర్ కె. సునీత పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసిందని వివరించారు. మంజుల శ్రీవేణికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మండలానికి చేరిన 9,197 డస్ట్‌బిన్‌లు



మోపిదేవి: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా తడి, పొడి చెత్త సేకరణకు గాను మండల పరిషత్ కార్యాలయానికి 9,197 డస్ట్‌బిన్‌లు శనివారం చేరాయని ఈఓపీఆర్డీ బి. అశోక్ తెలిపారు. తొలి విడతలో వచ్చిన ఈ డస్ట్‌బిన్‌లను మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాలకు సరఫరా చేశారని చెప్పారు. గ్రామ కార్యదర్శులు ఉప్పాల వెంకటేశ్వరరావు, రామ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.25,116 విరాళం



మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి నాగాయితిప్ప గ్రామస్తులు కంఠంనేని ఎస్వీ ప్రసాద్ కుటుంబ సభ్యులు రూ. 25,116 విరాళంగా అందజేశారు. శనివారం సాయంత్రం స్వామి వారిని దర్శించుకున్న కంఠంనేని కుటుంబ సభ్యులు విరాళం చెక్కును ఆలయ అధికారి అర్జునరావుకు అందజేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నసమారాధన

గుడివాడ టౌన్: పట్టణంలోని వివిధ ఆలయాల్లో శనివారం భారీగా అన్న సమారాధనలు జరిగాయి. శుక్రవారం అమ్మవారిని శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించిన నేపథ్యంలో స్థానిక పెద్దవీధిలో శ్రీ వడ్డపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో అన్న సమారాధన చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వల్లూరుపల్లి సుధాకర్, చుండూరి శేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ధనాల వెంకట రత్నారావు-లక్ష్మి దంపతులు పాల్గొన్నారు. స్థానిక కొత్తపేటలో శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అన్నసమారాధన చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 8 మందికి ఉద్యోగాలు

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 8 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అంజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నడుపుతున్న సాఫ్ట్‌వేర్ కంపెనీకి కావలసిన సిబ్బంది కోసం జాబ్ మేళా నిర్వహించి 8 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నవీన్, హిమానిలీని, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవా సారథులు వలంటీర్లు

- వెలకట్టలేమంటున్న లబ్ధిదారులు
- ఎంత చెప్పినా తక్కువే అంటున్న ప్రజలు
- వలంటీర్ వ్యవస్థపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఆగ్రహం



తమిళనాడు వెళ్లి కేవైసీ తీసుకుంటున్న వలంటీర్ షేక్ రసూల్ అహ్మద్ (ఫైల్)



బందలాయిచెరువులో మంచంపై నుంచి కదలనేని దివ్యాంగురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగమణి (ఫైల్)



హైదరాబాద్ వెళ్లి పింఛన్ ఇచ్చిన వలంటీర్లు (ఫైల్)

అవనిగడ్డ: వలంటీర్లు అందిస్తున్న సేవలు ఎంత చెప్పినా తక్కువే అంటున్నారు అన్నివర్గాల ప్రజలు. సీఎం జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ అంతలా ఆదరణ పొందుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారు జామునే లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారు. ఏ సమస్య వచ్చినా చెప్పిన వెంటనే పరిష్కరిస్తున్నారు. కరోనా సమయంలో వలంటీర్లు వెలకట్టలేని సేవలు అందించారు. అయినవారే దరిదాపులకు రాలేని పరిస్థితుల్లో కొంతమంది వలంటీర్లు దగ్గరుండి కరోనా మృతులకు అంత్యక్రియలు నిర్వహించారు. సొంత బిడ్డలే దూరమై పోతున్న ఈ రోజుల్లో కన్నబిడ్డలకంటే ఎక్కువగా చూసుకుంటున్నారని పలువురు వృద్ధులు వలంటీర్ల సేవలను ప్రశంసిస్తున్నారు. మంచి చేస్తున్న వారిపై నిందలు వేయడం తగదని హితవు పలుకుతున్నారు. రాజకీయాలు ఉంటే రాజకీయంగానే ఎదుర్కోవాలని, ఎన్నో సేవలందిస్తున్న వలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం మానుకోవాలని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు హితవు పలికారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1601 మంది వలంటీర్లు సేవలందిస్తున్నారు.

హైదరాబాద్ వచ్చి పింఛన్ ఇచ్చారు



నాకు అనారోగ్యం వల్ల నాలుగు నెలల కిందట హైదరాబాద్‌లోని హాస్పటల్‌లో చేరాను. మా ఊరి నుంచి పింఛన్ ఇచ్చేందుకు వలంటీర్లు రేపల్లె సురేష్, భాను 365 కి.మీ దూరం హైదరాబాద్ హాస్పటల్‌కు వచ్చి పింఛన్ ఇచ్చారు. పింఛన్ ఇవ్వడం కోసం అంతదూరం రిస్క్ తీసుకుని వచ్చేదెవరు. నా వయస్సు 66 సంవత్సరాలు. నాకు చిన్నప్పుడే ఎడమకాలికి పోలియో వచ్చి అవుడుగా నడుస్తాను. గతంలో ఎన్నో సార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయలేదు. వలంటీర్లు వచ్చాక అన్నీ దగ్గరుండి పింఛన్ మంజూరు చేయించారు. మంచి పనులు అందరికీ నచ్చవు. చెడగొట్టాలని చాలా మంది కాచుకు కూర్చున్నారు.

– రేపల్లె రామ్మోహనరావు, అశ్వరావుపాలెం, అవనిగడ్డ మండలం

ఇంటి స్థలం ఇప్పించారు



పెళ్లయి ఆరేళ్లవుతోంది. అప్పటి నుంచి నివేశన స్థలం కోసం పలు సార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. ఇక రాదని వదిలేశాం. వలంటీర్ బెల్లంకొండ మస్తాన్ అన్నీ పూర్తి చేసి పంపించారు. మోదుమూడి జగన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది. వలంటీర్ లేకపోతే మాకు ఇంటి స్థలం వచ్చేదికాదు. నేను ఎక్కడికీ వెళ్లకుండానే ఆధార్ కార్డులో ఇంటిపేరుని మార్పించారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా మేము ఎక్కడికీ వెళ్లకుండానే వలంటీర్ ఇంటికే తీసుకొచ్చి ఇస్తున్నారు.

– కేశని పావని, వలందపాలెం, అవనిగడ్డ మండలం

తమిళనాడు వచ్చి కేవైసీ తీసుకున్నారు



మా బాబు అవనిగడ్డలో ఒకటో తరగతి చదువుతున్నాడు. అమ్మ ఒడి పథకం మంజూరైంది. నేను డెలివరీ కోసం మా పుట్టిల్లు తమిళనాడులోని వలతూర్ గ్రామానికి వచ్చాను. వలంటీర్ షేక్ రసూల్ అహ్మద్ అవనిగడ్డ నుంచి తమిళనాడు వచ్చి అమ్మ ఒడి కేవైసీ తీసుకున్నారు. వలంటీర్ ఉండబట్టే నాకు అమ్మఒడి వచ్చింది. లేదంటే వచ్చేది కాదు. సేవలను కూడా బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్న వలంటీర్లను విమర్శించడం తగదు.

– షేక్ షీరెన్, 7వ వార్డు, అవనిగడ్డ

సర్టిఫికెట్లు ఇంటికొచ్చి ఇచ్చారు



గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవాళ్లం. పనులు మానుకుని తిరగడం వల్ల కూలీ పోయేది. తిరిగేందుకు ఖర్చులు అయ్యేవి. ఏడాది కిందట మా అబ్బాయికి కుల ధ్రువీకరణ పత్రం కావాల్సి వస్తే వలంటీర్ నాగినేని నాగమణి అన్నీ తానే చూసుకుని సర్టిఫికెట్‌ను ఇంటికి తీసుకొచ్చి ఇచ్చింది. ఏ సర్టిఫికెట్ కావాలన్నా, ఎలాంటి సమస్యలు వచ్చినా పిలిస్తే చాలు వచ్చి అన్నీ పరిష్కరిస్తున్న వలంటీర్లపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసం.

– కమ్మిలి శ్రీను, బందలాయిచెరువు

నేడు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి పర్యటన

నాగాయలంక: బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం నాగాయలంక మండలంలో పర్యటిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు శనివారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు గుల్లలమోద వద్ద మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు అనువుగా జెట్టి నిర్మాణానికి సంబంధించిన ప్రాంతాన్ని పరిశీలించి గ్రామ మత్స్యకారులతో చర్చిస్తారు. అనంతరం ఎదురుమొండిలో రూ.75 లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి సంబంధించి గ్రామస్తులు, అధికారులతో చర్చించి నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తారు.

23న నేత్ర వైద్య శిబిరం

నాగాయలంక: స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణానది ఒడ్డున ఫుడ్ కోర్టు భవనంలో ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. కంటిలో శుక్లాలు ఉన్నవారికి శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 94906 36466, 70936 17778 నంబర్లను సంప్రదించాలన్నారు.

అవనిగడ్డలో టీడీపీ బస్సు యాత్ర

అవనిగడ్డ: టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్ గ్యారెంటీ బస్సు యాత్ర అవనిగడ్డ నియోజవర్గంలోని పలు ప్రాంతాల్లో సాగింది. ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర కొడాలి, తాడేపల్లి, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ వరకు సాగింది. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుని విమర్శిస్తూ మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర నాయకులు శ్రీరామం రాజగోపాల్(తాతయ్య), కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య) తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



లింగారెడ్డిపాలెంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



కొప్పెల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ వాణి

కోడూరు: ప్రజలందరికీ సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. లింగారెడ్డిపాలెం సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 1,054 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంటే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై కూడా విమర్శలు చేసే స్థాయికి ప్రతిపక్షాలు దిగజారాయని చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎఫ్‌ఓ, ప్రత్యేకాధికారి రాజశేఖర్, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వీర వెంకట నారాయణరావు, సర్పంచి యర్రంశెట్టి దుర్గ, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు పరిశె మాధవరావు, చిట్టిప్రోలు బ్రహ్మరావు, నాయకులు కొండవీటి వీరవెంకట నారాయణరావు, గుర్రం బసవయ్య, ఎంపీటీసీ దాసరి వెంకటేశ్వరరావు, ముద్దినేని చంద్రరావు, చిట్టిప్రోలు విజయభాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు లబ్ధి..

గూడూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పోలవరం గ్రామంలో 1030 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ పిచ్చుక గంగాధరరావు, ఆర్బీకే చైర్మన్ పర్లం పెదబాబు, ఏపీఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచి నక్కిన నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు గొరిపర్తి రవికుమార్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందరికీ చేరాలి..

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని తహసీల్దార్ కె. నవీన్ కుమార్ అన్నారు. పెదకళ్లేపల్లి సచివాలయం-1 వద్ద సర్పంచ్ అరజా సంధ్యారాణి అధ్యక్షతన శనివారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ వివిధరకాల సర్టిఫికెట్ల జారీలో ఆలస్యంవల్ల లబ్ధిదారులకు అన్యాయం జరగకూడదని జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. 11 రకాల సేవలు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు అందుతున్నాయని వివరించారు. స్థానికులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీటీసీ అరజా ఆశాదేవి, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ బి. అశోక్, వీఆర్వోలు, నాయకులు పాల్గొన్నారు.

139 ధ్రువీకరణ పత్రాలు అందజేత..

పెడన: కొప్పెల్లి గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో 139 ధ్రువీకరణ పత్రాలను ఎంపీపీ వాణి, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్‌లు అందజేశారు. శనివారం జరిగిన జగనన్న సురక్షలో లబ్ధిదారులను ఉద్దేశించి ఎంపీపీ వాణి మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అచ్యుతరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు దావు భైరవలింగం, సర్పంచ్ పూరిళ్ల దుర్గాభవాని, పెడన మండల జేసీఎస్ ఇన్‌చార్జి బెజవాడ నాగబాబు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే..

కృత్తివెన్ను: యండపల్లి, నిడమర్రు -2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి. మహేష్, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, కృత్తివెన్ను పీఏసీఎస్ చైర్మన్ లకోష్మజీ, వ్యవసాయ శాఖ జిల్లా డైరెక్టర్ పి. నాని, సర్పంచ్‌లు ప్రభుప్రసాద్, కృపావేణి, శ్రీదేవి, డెప్యూటీ తహసీల్దార్ శశికుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో పది ప్రత్యేక బియ్యం కౌంటర్లు

సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి పార్వతి



బియ్యం అందిస్తున్న జిల్లా అధికారి పార్వతి

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి వి.పార్వతి తెలిపారు. శనివారం స్థానిక రైతు బజారులో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో దివిసీమ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన రాయితీ బియ్యం ప్రత్యేక కౌంటర్‌ను పార్వతి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో పది రైతు బజార్లలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు గన్నవరం, మచిలీపట్నం, పామర్రు, చల్లపల్లిలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. హోల్‌సేల్ ట్రేడర్స్, మర్చంట్స్ ద్వారా కూడా అదనంగా కందిపప్పు, బియ్యం స్టాల్స్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పేద ప్రజలకు ఈ కౌంటర్లలో సాధారణ రకం బియ్యం కిలో రూ. 32, బీపీటీ రూ.46, సోనా మసూరి రూ.48లకు లభిస్తాయని చెప్పారు. కందిపప్పు కిలో రూ.135కు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ అధికారి బలి చక్రవర్తి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



పాడిరైతులకు బహుమతులు అందిస్తున్న వైద్యాధికారులు

కృత్తివెన్ను: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం చినపాండ్రాక గ్రామంలో లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ లేగదూడల స్థాయి నుంచే పశువులకు సరైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని చెప్పారు. దీనిపై పాడిరైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రైతులకు సబ్సిడీపై జొన్న విత్తనాలు అందించారు. అందాల పోటీలలో గెలుపొందిన దూడల యజమానులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, జేవీ రమణయ్య, కె. బాబూరావు, సుశాంత్, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పేర్ని కిట్టు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: సుదీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సత్వర పరిష్కారం లభిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. చినయాదర గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకం పేద ప్రజల కోసమేనని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచర్లపల్లి విజయ సారథి, వైఎస్సార్ సీపీ నాయకుడు అర్జా కిరణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుండేరు వంతెన పరిశీలన..

కోనేరుసెంటర్: బందరు మండలంలోని చిన్నాపురం గుండేరు వంతెనను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు శనివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదకు గుండేరు పాత వంతెన దెబ్బతినడంతో గ్రామస్తులు ఈ విషయాన్ని పేర్ని కిట్టు దృష్టికి తీసుకువెళ్లారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ వంతెన వద్ద దెబ్బతిన్న పైప్‌లైన్ మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని చెప్పారు. గుండేరు డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూటికాడను తొలగించాలని చెప్పారు.

వాహనాల్లో పరిమితికి మించి ఎక్కవద్దు



గుడివాడరూరల్: ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి అన్నారు. జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాల నివారణపై మల్లాయపాలెం సమీపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ పరిధిలోని ముదినేపల్లి జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఎస్‌ఐ పోలీస్ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుపై వెళ్లే వాహన దారులకు ప్రమాదాల నివారణపై సూచనలు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో అధిక సంఖ్యలో కూలీలను తరలిస్తున్న వాహనాలను ఆపి ప్రయాణీకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చార్జీలు కలిసి వస్తాయని ఎక్కువ మంది వాహనంలో ఎక్కితే ప్రమాదాలు జరిగితే నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మూర్తి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలపూడి సీఐ రాజశేఖర్ బదిలీ

కోనేరుసెంటర్: చిలకలపూడి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి సీఐగా ఆర్ పేట సీఐ రవికుమార్‌ను నియమించారు. రాజశేఖర్‌ను ఏలూరు వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు సీట్లు

మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులు మోనా (నూజివీడు), అరజా అక్షయ (శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుని జయంతి తెలిపారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ సత్యమూర్తి సేవలు ఎనలేనివి

చిలకలపూడి(మచిలీపట్నం): పేదలకు ఉచిత వైద్య సహాయం అందించిన మంచి మనిషి డాక్టర్ అవ్వా సత్యమూర్తి సేవలు ఎనలేనివని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి. శ్రీనివాసాచార్య అన్నారు. సత్యమూర్తి సంతాపసభ ఐఎంఏ హాల్‌లో శనివారం నిర్వహించారు. శ్రీనివాసాచార్య మాట్లాడుతూ సత్యమూర్తి 50 వేలకు పైగా శస్త్రచికిత్సలు చేశారన్నారు. ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ కె. శివప్రసాద్ మాట్లాడుతూ సత్యమూర్తి సేవాతత్పరుడని చెప్పారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వై. బాలసుబ్రహ్మణ్యం, వైద్యులు ఫణికుమార్, కేశవకృష్ణ, రావి శ్రీనివాసరావు, వీరంకి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బంటుమిల్లి: ఇరు వర్గాల మధ్య ఆర్థిక లావాదేవీలను పురస్కరించుకుని ఏర్పడ్డ వివాదంలో పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎ. పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జయపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు మునిపల్లి నాగరాజు, మునిపల్లి సుధాకర్‌లు స్థానిక డ్వాక్రా మహిళలకు మైక్రో ఫైనాన్స్ కంపెనీల ద్వారా వారాల చొప్పున వాయిదాలు చెల్లించే విధంగా అప్పులు ఇప్పించారు. వీరిద్దరు మహిళల పేరుతో ఆర్థిక సంస్థల వద్ద అప్పులకు మంజూరైన సొమ్ముల్లో సగం వాడుకుని మహిళలతోపాటు వాయిదాలు చెల్లించే విధంగా ఇరు వర్గాల వారు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో మహిళలు వారాల చొప్పున తీసుకున్న వాయిదాలను ఫైనాన్స్ సంస్థలకు చెల్లించారు. నాగరాజు, సుధాకర్‌లు మాత్రం చెల్లించాల్సిన సొమ్ములు సుమారు రూ. 14 లక్షలు ఫైనాన్స్ సంస్థలకు చెల్లించలేదు. దీంతో మైక్రో ఫైనాన్స్ వారు సొమ్ముల కోసం మహిళలపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో మహిళలందరు మూకుమ్మడిగా నాగరాజు, సుధాకర్‌లను నిలదీయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం జరిగిన రాజీ చర్చల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని రాజీ కుదరలేదు. దీంతో జుజ్జవరపు జ్యోతి, జుజ్జవరపు సుజాత మరికొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగరాజు, సుధాకర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.